కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు

- ఉద్యోగుల కొరతతో పనుల్లో జాప్యం
- మరోపక్క ఉన్న వారిపైనే పనిభారం
- తహసీల్, మండల పరిషత్‌లో భర్తీకి నోచుకోని పోస్టులు



ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతకాలంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫలితంగా పనులు వేగంగా జరగకపోగా.. ఉన్న ఉద్యోగులపై పని భారం పడుతోంది. తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయంలో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉన్నతాధికారుల సమావేశాలు, ఇతర పనుల నిమిత్తం తహసీల్దార్ బయటకు వెళ్తే రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. డిప్యూటీ తహసీల్దార్ పోస్టు భర్తీ జరగక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై పనుల భారం పడుతోంది. ఇటీవల కాలం వరకు కార్యాలయంలో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తించారు. వీరంతా ప్రభుత్వ ఆదేశాల మేరకు జీపీఓలుగా రెవెన్యూ గ్రామాల్లోకి వెళ్లారు. ఇక రేమిడిచర్ల గ్రామ రెవెన్యూ పరిధి క్లస్టర్లు 1, 2ల్లో గ్రామ పాలనాధికారుల పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి.

మండల పరిషత్ కార్యాలయంలోనూ అంతే..


మండల పరిషత్ కార్యాలయం

మండల పరిషత్ కార్యాలయంలో కూడా ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఇక్కడ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మండల కార్యాలయానికి వచ్చే ప్రజల పనులు జరగడం లేదు. క్షేత్రస్థాయిలో విధినిర్వహణకు ఎంపీడీఓ వెళ్తే ఆఫీసులో సమాధానం ఇచ్చే వారే కరవయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన ఉద్యోగులపై పని భారం పడనున్నందున పరిస్థితి మరింత తీవ్రం కానుంది. ఈమేరకు ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత తీర్చాలి..


ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టులు భర్తీకి నోచుకోక ఏడాదిగా సేవలు సక్రమంగా అందడం లేదు. తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పోస్టుల భర్తీని అధికారులు అత్యవసరంగా భావించాలి. తద్వారా మెరుగైన సేవలు అందుతాయి.

– వేమిరెడ్డి మల్లారెడ్డి, తెల్లపాలెం

ఉన్నతాధికారులకు నివేదించాం..


పోస్టులు ఖాళీ ఉన్న అంశాన్ని జిల్లా పరిషత్ కార్యాలయానికి నివేదించాం. ఏడాదికి పైగా సూపరింటెండెంట్ పోస్టు భర్తీకి నోచుకోకపోగా, అటెండర్లు కూడా లేరు. సిబ్బంది కొరత ఉన్నా ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందిస్తున్నాం.

– బి.సురేందర్, ఎంపీడీఓ

సిబ్బంది కొరత నిజమే


తహసీల్‌లో సిబ్బంది కొరత నిజమే. ఉన్న వారితోనే ప్రజలకు ఇబ్బంది రాకుండా సేవలను అందిస్తున్నాం. అలాగే, ఖాళీల విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భూముల రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్ దరఖాస్తులు పెండింగ్ లేవు.

– ఎం. ఉషాశారద, తహసీల్దార్

కౌంటింగ్ కేంద్రాలకు భవనాల పరిశీలన


సత్తుపల్లి : అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్

సత్తుపల్లి/తల్లాడ: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల, తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాలలో పరిశీలించారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సుల రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న వసతులపై ఆరా తీశారు. భవన సదుపాయం, విద్యుత్, తాగునీటి వసతులను పరిశీలించిన సబ్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్లు సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓలు నాగేశ్వరరావు, సురేష్‌బాబు, ఈఓఆర్‌డీ కృష్ణ, ఆర్‌ఐ ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

భూమిని కాపాడాలంటూ సీపీకి వినతి

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తి పంచాయతీ పరిధి సర్వే నంబర్ 465లోని ఐదు గుంటల భూమిని కొందరు ఆక్రమించుకుని, అడిగితే అట్రాసిటీ కేసులు పెట్టి వేధిస్తున్నారని గ్రామస్తులు పలువురు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి అవసరాల కోసం భూమిని తీస్తే.. ఓ పార్టీ తరపున కొనుగోలు చేశామంటూ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రూ.కోటి విలువైన ఈ స్థలంలో కొన్నాళ్లు ఆంజనేయస్వామి విగ్రహం పెట్టి పూజలు చేశారని, సీతారాముల కల్యాణ ఉత్సవం కూడా నిర్వహించేవారని తెలిపారు. ఈమేరకు భూఆక్రమణపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సోమవారం పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసీమ్, ప్రసాద్, జాకోబ్, సత్యనారాయణ, జోజి, వేలాద్రి పాల్గొన్నారు.

అంతా కలిసి మనువాదాన్ని తిప్పికొట్టాలి



నూతన అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, పుల్లయ్య

బోనకల్: నానాటికీ దేశంలో పేట్రేగిపోతున్న మనువాదాన్ని తిప్పికొట్టి సమసమాజ స్థాపనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ సూచించారు. మండలంలోని జానకీపురంలో సోమవారం జరిగిన కేవీపీఎస్ 4వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో కులవివక్షతను అంతమొందించేందుకు కేవీపీఎస్ నాయకులు కృషి చేయాలని, ఇదే సమయాన రిజర్వేషన్లను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాగా, అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని సూచించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. అనంతరం కేవీపీఎస్ మండల అధ్యక్షుడిగా రామాపురానికి చెందిన గార్లపాటి రమేష్, కార్యదర్శిగా తూటికుంట్ల గ్రామానికి చెందిన నోముల పుల్లయ్యతో పాటు 12 మందిని ఎన్నుకున్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కర్లకుంట సురేష్, కిలారు సురేష్, చింతలచెర్వు కోటేశ్వరావు, మందా సత్యానందం, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

సత్తుపల్లి: సింగరేణి ఓసీలో పేలుస్తున్న బాంబుల కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం, సింగరేణి పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితులు సోమవారం తహసీల్ ఎదుట ధర్నా చేయగా, తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్, ద్వారకాపూరి కాలనీ, వెంగళరావు నగర్, విరాట్ నగర్‌లో పలువురు పేదల ఇళ్లు బాంబు పేలుళ్ల కారణంగా దెబ్బతిని కూలే స్థితికి చేరినందున బాధితులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్, నాగరాజు, పద్మ, తులసి, రమణమ్మ, చారి, మహేష్ పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారికి పూజలు


కొణిజర్ల : సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు


సత్తుపల్లి : సరస్వతీదేవి ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు అమ్మవారిని సోమవారం సరస్వతీదేవి రూపంలో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే, మండపాల వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేయగా కమిటీల ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్


ముదిగొండ: ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


మధిర : నృత్యం చేస్తున్న చిన్నారి

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం


భట్టిని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ బాధ్యులు

మధిర: మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ఏర్పాటైన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ బాధ్యులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలు తెలుసుకున్న ఆయన కార్యవర్గాన్ని అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాగి బాలస్వామి, చేకూరి వినోద్, గౌరవ అధ్యక్షుడు మక్కెన నాగేశ్వరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు మురళి, కోశాధికారి పల్లపోతు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైరా మార్కెట్ చైర్మన్...


డిప్యూటీ సీఎం భట్టితో చైర్మన్ గంగారావు

వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఇటీవల నియమితుడైన బొర్ర గంగారావు సోమవారం మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. తనను నియమించడంపై ఆయన కృతజ్ఞతలు చెప్పగా, మార్కెట్ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని, పార్టీలో కష్టపడిన వారికి తప్పక పదవులు లభిస్తాయని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బోనకల్: మండలంలోని జానకీపురం ఉన్నత పాఠశాలలో 2008–2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. బోనకల్‌లో జరిగిన సమావేశంలో 17ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు చదువుకున్నప్పటి సంగతులు గుర్తుచేసుకున్నారు. అలాగే, ఆనాటి గురువులు రాయల శ్రీనివాసరావు, దయానంద నాగభూషణం, దాస్, కొలికొండ సురేష్, కేఎస్.ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు, పాలకుర్తి బాస్కర్‌రావును సన్మానించారు.

గ్రామ సమస్యలపై ఎంపీకి వినతి


సమస్యలు వివరిస్తున్న నాయకులు

వేంసూరు: మండలంలోని అడసర్లపాడులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మాజీ వైస్ ఎంపీపీ అట్లూరి సత్యనారాయణరెడ్డి కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కలిసి అంతర్గత రహదారులు, ఊటవాగుపై హైలెవల్ బ్రిడ్జి, కొండ్రుపాడు – అడసర్లపాడు మధ్య కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన వెంట మునగాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల సంబురం

- ఊరూవాడ బతుకమ్మ వేడుకలు


సత్తుపల్లి టౌన్ : 13అడుగుల భారీ బతుకమ్మ ఊరేగింపులో మహిళలు

ఎంగిలి పూలతో మొదలైన బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మతో సోమవారం ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ఆడిపాడిన మహిళలు చివరిరోజు మరింత ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో పోటాపోటీగా పేర్చిన అతివలు సాయంత్రం కొత్త దుస్తులు ధరించి గ్రామాలు, పట్టణాల్లో చెరువుల వద్దకు చేరారు. బతుకమ్మలను ఒక చోటకు చేర్చి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటం ఆడుతూ సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరి బతుకమ్మ సంబురాల్లో పాల్గొనగా.. బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి ఇళ్లకు బయలుదేరారు. అలాగే, సత్తుపల్లి శ్రీనివాసా టాకీస్ రోడ్డులోని ముత్యాలమ్మ గుడి వద్ద 13అడుగుల భారీ బతుకమ్మతో పాటు కాళికా రూపంలో ఎనిమిది అడుగులుగా పేర్చిన బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


తల్లాడ : అంబేద్కర్ నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న ఐసీడీఎస్ ఉద్యోగులు


తల్లాడ : నారాయణపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కారేపల్లి : పెద్ద చెరువు వద్ద...


ఏన్కూరు : బతుకమ్మలతో మహిళలు


కారేపల్లి : బతుకమ్మతో యువతి


మధిర : టీచర్స్ కాలనీలో బతుకమ్మ ప్రతిమ చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు


వైరా : మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రాందాస్, కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్తంగా..

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి


సిబ్బందికి సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న రోజువారీ కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు రావుల రాజబాబు డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో సిబ్బంది దీక్షకు సోమవారం మద్దతు తెలిపిన ఆయన మాట్లాడారు. జీఓ 527, 64ను రద్దు చేసి సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కాగా, వారు 19రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని పేర్కొన్నారు. నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుశీల, సీతారత్నం, పార్వతి, సత్యవతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను సోమవారం మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పనులను కమిషనర్ గురులింగం పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బంది వెంకన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని అనంతసాగర్‌కు చెందిన నూకల వేణు, నాగేశ్వరరావు, కృష్ణవేణిపై సోమవారం కేసు నమోదైంది. గ్రామంలో వేణు ఇంటి ఎదురుగా ఉండే కోసూరి వీరయ్య ఆదివారం ఆయన కుమారుడ్ని తిడుతుండగా, తమనే తిడుతున్నావంటూ వేణు, నాగేశ్వరరావు, కృష్ణవేణి ఆయనతో గొడవ పడ్డారు. ఆయనను నెట్టేయడంతో తలకు గాయమైంది. ఘటనపై వీరయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

ఎంపీటీసీ స్థానం ఎస్సీలకు కేటాయించాలి

కారేపల్లి: సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ సామాజిక వర్గం జనాభా అధికంగా ఉన్నందున రెండు ఎంపీటీసీ స్థానాల్లో ఒకటి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఖమ్మంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని 16ఎంపీటీసీ స్థానాల్లో ఒక్కటి ఎస్సీలకు కేటాయించకపోవడం అన్యాయం జరిగిందని తెలిపారు. సంఘం నాయకులు ఆదెర్ల రాములు, బోగ్గిళ్ల వెంకటేశ్వర్లు, సోమందుల నాగరాజు, ఎర్రబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసీన మహాభారతం రచించిన రిటైర్ హెచ్‌ఎం

వేంసూరు: సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంకు గ్రామానికి చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు మందపాటి సత్యనారాణరెడ్డి దంపతులు సర్వసీన మహాభారతమను రచించారు. ఈ రచనను సోమవారం కందుకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో తుమ్మూరు వెంకటరెడ్డి దంపతులకు అంకితం ఇచ్చారు. గతంలో భాగవతంలో శ్లోకాలను తెలుగు వాడుక భాషలో రచించారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట మాజీ సర్పంచ్ భూక్యా వీరభద్రం సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మధిరలోని డిప్యూటీ సీఎం భట్టి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగగా, వీరభద్రంతో పాటు 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా వారికి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, వేముల కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, గుగులోతు లచ్చిరాం నాయక్ మేడ ధర్మారావు, బాణోతు రామారావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలపిట్టను సంరక్షించుకుందాం

కల్లూరు: రైతుల నేస్తమైన పాలపిట్టను రక్షించుకునేలా అందరూ ముందుకు రావాలని అటవీ శాఖ వన్యప్రాణి అధికారి శంకరన్ సూచించారు. హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో సోమవారం ఆయనను కల్లూరుకు చెందిన గ్రీన్ వారియర్ చంద్రశేఖర్ కలిశారు. ఈ సందర్భంగా పాలపిట్ట ప్రత్యేకతలు, దీనితో లాభాలు, అంతరించిపోతున్న జాబితాలో చేరిన అంశంతో పాటు రక్షించాల్సిన ఆవశ్యకతపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈమేరకు పాలపిట్టను పట్టుకోవడం, వ్యాపారం చేయడం, హింసించడం చట్టవిరుద్ధమనే విషయాన్ని ప్రజలంతా గుర్తించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఒత్తిడి చేస్తాం

సత్తుపల్లిటౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ తెలిపారు. సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు, ఇళ్లస్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త ఫించన్లు మంజూరు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయడమే కాక గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జాజిరి జ్యోతి, బాల బుచ్చయ్య, కృష్ణ, సనందరావు, లక్ష్మీ, వెంకట్రావ్, రమాదేవి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మొక్కలు నరికిన దుండగులు

కల్లూరు: మండలంలోని యజ్ఞనారాయణపురం గ్రామానికి చెందిన రావి రాంబాబు మామిడి తోటలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మొక్కలను నరికివేశారు. ఆయన నాలుగేళ్ల క్రితం మామిడి మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటుచేసి గేటు పెట్టాడు. అయితే, ఆదివారం సాయంత్రం పశువులకు గడ్డి కోసెళ్లిన ఆయన సోమవారం ఉదయం వచ్చేసరికి 16 మామిడి మొక్కలు నరికేసి ఉన్నాయి. ఈమేరకు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లిలో పది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 31 మంది రైతుల సర్వీస్‌లు ఉండడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విద్యుత్ ఏఈ మనోహర్, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సిరెడ్డి, టెక్నీషియన్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలను విస్మరించడం అభివృద్ధి కాదు'

బోనకల్: ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే ప్రతిపక్షాల కర్తవ్యమని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్)లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు ఏ ప్రాతిపదికన, ఏ పార్టీకి చెందిన వారికి ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ శ్రేణులకు ఇవ్వడం అభివృద్ధి కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఇందిరమ్మ గ్రామకమిటీలను వేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకే ఇళ్లు ఇచ్చినందున, కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పార్టీ నిత్యం పోరాడుతుందని గోపాల్‌రావు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు చింతలచెర్వు కోటేశ్వరావు, శీలం నర్సింహారావు, తుళ్లూరి రమేష్, మురళి, జొన్నలగడ్డ సునీత తదితరులు పాల్గొన్నారు.